క్లుప్తంగా

విద్యార్థులతో నీతి కథలు, పుస్తక సమీక్ష



విద్యార్థులతో నీతి కథలు చదివిస్తున్న గ్రంథాలయ శాఖ అధికారి ఎం భీమరాజు

కామవరపుకోట: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ శాఖ అధికారి ఎం. భీమరాజు ఆధ్వర్యంలో విద్యార్థులతో క్యారం బోర్డు శిక్షణ ఇచ్చి, పుస్తకాలపై సమీక్ష నిర్వహించడంతోపాటు, నీతి కథలు చదివించి వాటి భావాలను విద్యార్థులకు వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో స్థానిక మండల పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.1.11 లక్షల విరాళం



దాత మదన గోపాలరెడ్డి దంపతులకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు శుక్రవారం రూ. 1,11,111 విరాళంగా అందజేశారు. తణుకు మండలం సజ్జాపురానికి చెందిన బాపతు మదన గోపాలరెడ్డి ముందుగా సతీసమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాత దంపతులకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలు



లారీ ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడిన నాగేశ్వరరావు

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): జీలుగుమిల్లి మండలం దర్బగూడెం సమీపంలో పొలం నుంచి ఇంటికి వెళ్తున్న భార్యాభర్తలను లారీ ఢీకొట్టిన సంఘటనలో తీవ్రంగా గాయాలపాలైన ఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దర్బగూడెంకు చెందిన భార్యభర్తలు నాగేశ్వరరావు, శారమ్మ పొలం పనులకు వెళ్లి తిరిగి వస్తున్నప్పుడు దర్బగూడెం సమీపంలో వారిని లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో వారు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రేపటి నుంచి సువార్త పండుగలు

కొయ్యలగూడెం: సువార్త సంగీత పండుగలు ఈనెల 14,15,16 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఎం.దేవసహాయం పేర్కొన్నారు. జంగారెడ్డిగూడెం రోడ్డులోని జీపురాజు ప్రాంగణంలో సమావేశాలు నిర్వహిస్తామని ముఖ్య ప్రసంగీకులుగా డాక్టర్ ఏఆర్ స్టీవెన్సన్, రెవరెండ్ పి.స్టీవెన్ పాల్గొంటారని తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు సంగీత పండుగలు ప్రారంభమవుతాయన్నారు.

హమాలీ బిల్లులు సకాలంలో విడుదల చేయాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లాలో సివిల్ సప్లై హమాలీలకు హమాలీ బిల్లులు సకాలంలో విడుదల చేయాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ ఉదయ్ భాస్కరరావు డిమాండ్ చేశారు. స్థానిక అల్లూరి సత్యనారాయణ భవనంలో యూనియన్ జిల్లా సమావేశం గద్దె సూర్యారావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రేషన్ సరుకులను వారం రోజుల్లో ఎగుమతులు, దిగుమతులు చేయాలని ఒత్తిడి చేస్తుందన్నారు. నెలంతా కష్టపడి పనిచేస్తే సకాలంలో బిల్లులు ఇవ్వకుంటే కార్మికులు తమ కుటుంబాలను ఎలా పోషించేకుంటరన్నారు. ఈఎస్ఐ సమస్య దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉందని ప్రభుత్వం కోర్టులో జోక్యం చేసుకుని తక్షణమే పరిష్కరించాలని కోరారు. సీఐటీయూ సీనియర్ నాయకులు చింతకాయల బాబూరావు, జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజులు మాట్లాడుతూ హమాలీలను సంస్థ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా కె.శేఖర్, కార్యదర్శిగా గద్దె సూర్యారావు, ఉపాధ్యక్షులుగా తిరుపతయ్య, అబ్బులు, సహాయ కార్యదర్శిగా కొర్ర కిషోర్, కోశాధికారిగా ఎస్ రాంబాబు, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా డీఎంకు వినతి పత్రం అందజేసారు.

రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్న ప్రభుత్వం



బుట్టాయగూడెం లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు



గూటాలలో ధాన్యం రాశులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు ఎనలేని కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బుట్టాయగూడెం, రెడ్డిగణపవరం గ్రామాల్లోని సహకార సంఘ కార్యాలయాల్లో వ్యవసాయ సహకార సంఘం, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే బాలరాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో దళారులకు ధాన్యం విక్రయించి మోస పోవద్దని అన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం పంటల గిటుబాటు ధరలు కల్పించి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వం సూచించిన నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ధాన్యం విక్రయాలకు సహకరించాలని కోరారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్ రావు, సర్పంచులు తెల్లం వెంకాయమ్మ, తెల్లం జయమ్మ, ఎంపీటీసీ అల్లూరి రాంమోహన్‌రావు, ఏఓ బి.సుమలత సహకార సంఘాల సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు నిరాశ చెందవద్దు

పోలవరం రూరల్: రైతులు ఎవ్వరూ నిరాశ చెందవద్దు, ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొంటుందని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. పోలవరం మండలంలో గూటాల పంపింగ్ స్కీమ్ వద్ద రైతులు కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని శుక్రవారం బాలరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు రైతులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని, తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని ఆదేశించారన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధర అందించి కొనుగోలు చేయాలని సీఎం ఆదేశాలిచ్చారని తెలిపారు. రికార్డు స్థాయిలో పంట నష్ట పరిహారం రైతుల ఖాతాల్లో జమ చేశారని అన్నారు. వ్యవసాయం దండగ అన్న ప్రతిపక్ష నాయకులు కల్లబొల్లి కబుర్లు చెబుతూ రాజకీయంగా రాద్ధాంతం చేయాలని చూస్తున్నారన్నారు. టీడీపీ, జనసేన పార్టీలు మాటలు నమ్మవద్దని, వైఎస్సార్ సీపీ రైతుకు అండగా నిలబడే పార్టీ అన్నారు. రైతే రాజు అనే నానుడిని నిజం చేసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, ప్రతిపక్షాల కుయుక్తులను రైతులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

చలివేంద్రం ప్రారంభం



ధర్మాజీగూడెంలో చలివేంద్రాన్ని ప్రారంభించిన బీజేపీ నాయకులు

లింగపాలెం: ధర్మాజీగూడెంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గారపాటి చౌదరి చలివేంద్రాన్ని ప్రారంభించారు. శుక్రవారం ధర్మాజీగూడెం కొత్తబస్టాండ్ ఆవరణలో లింగపాలెం మండల బీజేపీ అధ్యక్షుడు కుర్ర సుబ్రమణ్యేశ్వరరావు ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని చౌదరి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు చౌటపల్లి విక్రమ్‌కిషోర్, చిన్నం సతీష్,కె పుల్లయ్య, నాగేశ్వరరావు, మధు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



యర్రగుంటపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బి.మంగాదేవి

చింతలపూడి: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం అని సర్పంచ్ తుల్లిమెల్లి రాణి అన్నారు. యర్రగుంటపల్లి సచివాలయం 1 పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. 11 నుంచి 18 ఏళ్ల మధ్య వయస్సున్న కిశోర బాలికలు తప్పని సరిగా బడికి వెళ్లి చదువుకోవాలని కోరారు. 18 ఏళ్లు నిండిన తరువాత ఆడపిల్లలకు వివాహాలు చేయాలని సూచించారు. చిన్న వయస్సులో వివాహం చేయడం వల్ల మహిళలు అనేక అనారోగ్య సమస్యలకు గురవుతారని వైస్ ఎంపీపీ సొదరబోయిన వరలక్ష్మి హెచ్చరించారు. చదువుకునే వయస్సులో ఆడపిల్లలకు సరైన పౌష్టికాహారం అందించడం ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్ వైజర్ టి మరియమ్మ, బి శ్రీలక్ష్మి, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

కామవరపుకోట: శుక్రవారం స్థానిక కొండగూడెం సచివాలయంలో అంగన్‌వాడీ, స్థానిక ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో బాల్యవివాహాలపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బి.మంగాదేవి మాట్లాడుతూ బాల్యంలో ఆడపిల్లలకు వివాహం చేయడం వల్ల వారికి కుటుంబ వ్యవస్థ అర్థం కాక ఎన్నో అనర్థాలకు దారితీస్తాయని, వారు శరీరం బలహీనంగా ఉండి గర్భం ధరిస్తే పుట్టే పిల్లలు బలహీనంగా పుట్టి సరైన ఎదుగుదల లేక అనారోగ్య పాలవుతారని గ్రామస్తులకు వివరించారు. ఈ బాల్య వివాహాలు అరికట్టేందుకు గ్రామస్థాయిలో వీఆర్‌వో, వీఆర్‌ఏ, సెక్రటరీ, ఏఎన్ఎం, మహిళా పోలీస్, అంగన్‌వాడీ వర్కర్స్ సభ్యులుగా ఉంటారన్నారు. ప్రతి ఒక్కరూ బాల్యవివాహాలు అరికట్టేందుకు కృషి చేయాలని కోరారు, వీఆర్‌వో కె.నాగేశ్వరరావు, మహిళా పోలీస్ ఎస్.భవానీ, అంగన్‌వాడీ వర్కర్స్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్ భక్తులతో బైక్ ర్యాలీ



హనుమద్ జయంతి బైక్ ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

జంగారెడ్డిగూడెం: హనుమజ్జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మే 14 ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు శ్రీ మద్ది ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి హనుమాన్ భక్తులతో భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామని పరిషత్ సభ్యులు కె.వి.ఆర్.సత్యనారాయణ తెలిపారు. జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం, కొయ్యలగూడెం, కామవరపుకోట మండలాలకు చెందిన హనుమ భక్తులు ఈ బైక్ ర్యాలీలో పాల్గొంటారని తెలిపారు. ఈ యాత్ర జంగారెడ్డిగూడెం శ్రీ మద్ది దేవాలయం వద్ద ప్రారంభమై జంగారెడ్డిగూడెం మీదుగా సాగుతూ కొత్తపేట అభయాంజనేయ స్వామి విగ్రహం వద్ద ముగుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా పరిషత్ సభ్యులు శుక్రవారం గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పరిషత్ సభ్యులు కె.వెంకటేశ్వరరావు, రవీంద్ర, సాయిబ్రహ్మం, వేమూరి శ్రీనివాస్, కె.దుర్గాప్రసాద్, తిప్పాభట్ల రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు కేరమ్స్ పోటీలు



ద్వారకాతిరుమలలోని గ్రంథాలయంలో కేరమ్స్ ఆడుతున్న విద్యార్థులు

ద్వారకాతిరుమల: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా విద్యార్థులకు శుక్రవారం కేరమ్స్ ఆటల పోటీ నిర్వహించారు. పిల్లలకు చదువుతో పాటు ఆటలు కూడా ఎంతో ముఖ్యమైనవని ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి గుర్రం బంగారుపాప అన్నారు. మానసిక వికాసానికి, ఉల్లాసానికి, మెదడు చురుకుతనానికి, క్రీడాస్ఫూర్తిని అలవాటు చేయడానికి ఈ పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు బట్టు మణి తదితరులున్నారు.

ప్రజలకు సత్వరం మంచినీటిని అందించాలి



పూళ్లలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని ఏడీఈకు సూచిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: గాలి వాన బీభత్సానికి గురైన బాధిత గ్రామాల్లోని ప్రజలకు మంచినీటి అందించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం తుఫాన్ తరహాలో వచ్చిన గాలి వాన బీభత్సానికి పూళ్ల, ఎంఎంపురం, కోడూరుపాడు, అన్నేవారిగూడెం, దుద్దేపూడి, కురెళ్లగూడెం గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో తీవ్ర విద్యుత్ అంతరాయం ఏర్పడింది. గ్రామాల్లో మంచినీటి సరఫరాకు ఇబ్బందులు నెలకొనడంతో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే వాసుబాబు పూళ్ల, ఎంఎంపురం గ్రామాల్లో పర్యటించారు. గ్రామాల్లో చేపట్టిన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను ఆయన పరిశీలించారు. సంబంధిత అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లోని ప్రజలకు తాగునీటిని అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ఎట్టి పరిస్థితుల్లోని మంచినీటి పథకాలకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరాను చేయాలని సంబంధిత ఏడీఈ కె.గోపాలకృష్ణకు సూచించారు. విద్యుత్ శాఖకు రూ.70 లక్షల వరకు నష్టం వాటిల్లిందని, సుమారు 120 విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయని, వాటిన్నింటినీ పునరుద్ధరిస్తుమని ఎమ్మెల్యేకు ఏడీఈ వివరించారు. త్వరితగతిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని వాసుబాబు సంబంధిత ఉన్నతాధికారులను కోరారు. శనివారం ఉదయానికి గ్రామాల్లోని సరఫరాను పునరుద్ధరిస్తామని ఏడీఈ వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్, ఎంపీపీ కనమాల రామయ్య, డీసీసీబీ డైరెక్టర్ కందులపాటి రాజీలు, మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, తహసిల్దార్ షంషాద్దీన్, ఏవో ఎస్‌పీవీ ఉషారాణి, ఉప సర్పంచ్ పెద్దిరెడ్డి హరిబ్రహ్మానాయుడు, ఎంపీటీసీలు గొండు కృష్ణచైతన్య, బొల్లారపు జ్ఞానరమ్య పవన్, గంటా శ్రీనివాసరావు, ఎఎంసీ ఉపాధ్యక్షుడు పులిచర్ల వెంకటకృష్ణారావు, రాష్ట్ర కార్యదర్శి ఎం.జాన్సన్, జగన్‌సేవాదళ్ నియోజకవర్గ కన్వీనర్ తుమ్మగుంట రంగ, సచివాలయ ఉద్యోగులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి



పెదవేగిలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పెదవేగి : మండలంలో విధులు నిర్వహించే సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో పనిచేయాలని పెదవేగి జెడ్పీటీసీ, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు అన్నారు. బుధవారం పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం సర్వసభ్య సమావేశం అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులతో నిర్వహించారు. పెదవేగి ఎంపీపీ తాతా రమ్య అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. మండల వ్యవసాయశాఖాధికారిణి ముత్యాల ప్రియాంక మాట్లాడుతూ వ్యవసాయశాఖ యాంత్రీకరణలో భాగంగా వచ్చిన వివిధ యంత్ర పరికరాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. జడ్పీ వైస్ చైర్మన్ విజయ్ బాబు మాట్లాడుతూ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మిగతా శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో రైతులకు, ప్రజలకు, వివిధ వర్గాల ప్రజలకు సబ్సిడీపై ఇచ్చేవాటిని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు అర్హులకు పథకాలు చేరేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో జి రాజ్ మనోజ్, తహసీల్దార్ ఎన్. నాగరాజు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

దోమలతోనే అంటువ్యాధుల వ్యాప్తి



డ్రమ్ములో నిల్వ నీటిలో పెరుగుతున్న దోమలను చూపుతున్న వైద్యసిబ్బంది

గణపవరం: డెంగీతోపాటు అనేకరకాల అంటు వ్యాధులకు మూలం అపరిశుభ్రత, దోమలేనని, వాటి నిర్మూలనతో అంటు వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, కిరణ్మయి అన్నారు. గణపవరం పంచాయతీ పరిధిలోని నాలుగు సచివాలయాల్లో ప్రజలకు ఫ్రైడే డ్రైడేగా పాటించాల్సిన అవసరం, డెంగీ, మలేరియా వ్యాధుల వ్యాప్తి, లక్షణాలు, దోమల వ్యాప్తి, నివారణ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వారంలో ఒకరోజు ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించడంవల్ల దోమల వ్యాప్తిని చాలావరకు అరికట్టవచ్చునన్నారు. ఈసందర్భంగా వారు ఇళ్లవద్ద వాడుకలోలేని పాత్రలు, రుబ్బు రోలు, పాత ప్లాస్టిక్ పాత్రల్లో నిల్వఉన్న నీటిలో పెరుగుతున్న దోమల లార్వాను ప్రజలకు చూపించి అవగాహన కల్పించారు. తీవ్రమైన జ్వరం, తలనొప్పి, వెన్నునొప్పి లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించి, రక్త పరీక్ష చేయించుకోవాలన్నారు. సీహెచ్‌వో జాలాది విల్సన్, ఆరోగ్య సహాయకుడు యోహాన్, పీహెచ్ఎన్ వరలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

ఏలూరు రూరల్: మండలం జాలిపూడి పంచాయతీ నిధులు దుర్వినియోగంపై విచారణ చేపట్టాలని వైఎస్సార్ సీపీ నాయకుడు కోడిచుక్కల నాగశేషు కోరారు. శుక్రవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం సరళకుమారిని కలిశారు. గత సోమవారం జిల్లా కలెక్టర్ వి ప్రసన్న వెంకటేష్‌కు ఫిర్యాదు చేశానన్నారు. కలెక్టర్ విచారణకు ఆదేశించారని గుర్తు చేశారు. బ్లీచింగ్, వీధిలైట్లు కొనుగోలు, డ్రైయినేజీ, పారిశుధ్యం తదితర పనుల పేరుతో సర్పంచ్ వీధి నవ్య పంచాయతీ నిధులు పక్కదారి పట్టించారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా నిధులు భర్త అకౌంట్‌కు మరలించారని వివరించారు. 2017 నుంచి నేటి వరకూ పంచాయతీ నిధులు ఖర్చు, అభివృద్ధి పనులు మొత్తం సమాచారాన్ని సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు అందించాలని కోరారు.

వ్యక్తి అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: సచివాలయం-1 వీఆర్వో ఆకుల గీతాంజలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఓ వ్యక్తి మృతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం జంగారెడ్డిగూడెం పట్టణం బైపాస్ రోడ్డులో ట్రాక్టర్ షోరూమ్ పైన ఉన్న పోర్షన్‌లో సుంకర సురేష్‌కుమార్ (45) అద్దెకు నివాసం ఉంటున్నారు. శుక్రవారం ఉదయం భవనం యజమాని మూతిన వీర్రాజు పోర్షన్ వద్దకువెళ్లగా, సుంకర సురేష్‌కుమార్ మృతిచెంది ఉండటాన్ని గుర్తించాడు. దీంతో ఈ విషయాన్ని సచివాలయం-1 వీఆర్వో గీతాంజలికి సమాచారం ఇవ్వగా, ఆమె వచ్చి పరిశీలించి, స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు వినియోగించుకోవాలి



కాశిపాడులో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారిణి ప్రియాంక

గణపవరం: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉండాలని పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.ప్రియాంక అన్నారు. శుక్రవారం గణపవరం మండలం కాశిపాడు వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం, 104 వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా 8 మంది గర్భిణులకు, ముగ్గురు బాలింతలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. సాధారణ వ్యాధిగ్రస్తులు, కిశోర బాలికలు, అంగన్‌వాడీ పిల్లలు బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. మంచానికే పరిమితమైన ఇద్దరు రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, డేటా ఆపరేటర్ వసంత, ఎంఎల్‌హెచ్‌పీ రమ్య, ఏఎన్ఎం శివకుమారి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

15న లింగపాలెంలో డివిజన్ స్థాయి స్పందన

లింగపాలెం: ఈనెల 15వ తేదీ సోమవారం లింగపాలెంలో డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్టు తహసీల్దార్ మురళీకృష్ణ తెలిపారు. కలెక్టర్ వారి ఆదేశాల మేరకు నూజివీడు సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో లింగపాలెం తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శుక్రవారం తెలిపారు. ఈ స్పందన కార్యక్రమానికి డివిజన్, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

ఏపీఎంపై చర్యలు తీసుకోవాలి

కుకునూరు: మండలంలో డ్వాక్రా మహిళా గ్రూపుల వద్ద ఆసరా డబ్బులు బ్యాంకు నుంచి తీసుకునేందుకు అధికారుల సంతకం కోసం వెళితే డబ్బులు అడుగుతున్నారని, ప్రశ్నించినందుకు సీఐటీయూ నాయకుడైన తనపై ఏపీఎం దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడ్డాడని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ శుక్రవారం ఆరోపించారు. ఏపీఎం తీరుపట్ల సీపీఎం పార్టీ సీఐటీయూ తీవ్రంగా ఖండిస్తోందని, ఉన్నతాధికారులు ఈ అంశంపై స్పందించి తగిన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వేసవిలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, వడగాడ్పుల నుంచి తగిన రక్షణ పొందాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ దిలీప్ రెడ్డి మొసాలి సూచించారు. శుక్రవారం స్థానిక ఎస్‌బీఐ శ్రీరామ్ నగర్ శాఖ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఇంటి నుంచి బయటకు వచ్చే ముందు తగిన ఆహారం, ద్రవం తీసుకుని రావాలని, మధ్యలో ఎక్కడైనా దాహం వేస్తే నిర్లక్ష్యం చేయకుండా మంచినీరు గానీ మజ్జిగ, కొబ్బరి నీళ్లు వంటి ద్రవపదార్థాలు సేవించాలని సూచించారు. ఎండ వేడిమి నుంచి రక్షణ పొందడానికి టోపీలు గానీ గొడుగులు గానీ ధరించి బయటకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ వెంకట సత్యనారాయణ, శ్రీరామ్ నగర్ బ్రాంచ్ మేనేజర్ దీప్తి కాన్సర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

కొయ్యలగూడెం: వృద్ధులకు, యాచకులకు అన్న సమారాధన కార్యక్రమం శుక్రవారం పలుచోట్ల నిర్వహించారు. కొయ్యలగూడెంకి చెందిన గంగిరెడ్ల శ్రీనివాసరావు వర్థంతిని పురస్కరించుకుని బంధువులు, మిత్రులు కలిసి నూటయాభై మందికి మందికి అన్నదానం చేశారు. కన్నాపురం శ్రీ సౌభాగ్య దుర్గాదేవి వృద్ధాశ్రమం, కొయ్యలగూడెం ఎంపీపీ స్కూల్లో యాచకులకు, రిక్షా పుల్లర్లకి, వలస కార్మికులకు అన్నదానం చేశారు. గద్ద మధుసూదనరావు, రామలక్ష్మి దంపతుల సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు.